క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత నసీర్‌ఖాన్ మృతి



పెడన: వైఎస్సార్ సీపీ నాయకుడు, పెడన పురపాలక సంఘం మాజీ కో ఆప్షన్ సభ్యుడు, జామియా మసీదు కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి నసీర్‌ఖాన్ (65) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు. ఖాన్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మున్సిపల్ మాజీ చైర్మన్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, పెడనలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ముస్లిం పెద్దలు, కౌన్సిలర్లు నసీర్‌ఖాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హైస్కూల్‌ను సందర్శించిన ఏపీసీ

బంటుమిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్వశిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్(ఏపీసీ) శ్రీరాములు నాయక్ మంగళవారం సందర్శించారు. ఆయన పీఎంశ్రీ పథకంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ లాబ్‌ను, ఐటీ ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరిశీలించి వాటి పనితీరుపై ఇన్‌స్ట్రక్టర్‌తో సమీక్షించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం రికార్డులు పరిశీలించారు. మెనూలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించారు. ఎక్కువ మంది విద్యార్థులు భోజనం తీసుకునే విధంగా కృషి చేయాలని హెచ్‌ఎం బీవీ వెంకట్రావుకు సూచించారు. ఏపీసీ ఏపీఓ ఏడుకొండలు, జీసీడీఓ ఈతామహాలక్ష్మి, ఉపాధ్యాయ కార్యదర్శి జి.గోపయ్య పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి : ఏడీఏ జయప్రద

కోడూరు: వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని అవనిగడ్డ ఏడీఏ జేఎస్.జయప్రద కోరారు. మంగళవారం మండలంలోని ఉల్లిపాలెం, కోడూరు పంచాయతీల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తుఫాన్ ప్రభావం రాష్ట్రంపైన లేకపోయినా కూడా వర్షాలు పడేందుకు అస్కారం ఉందని, దీంతో డిసెంబర్ 5వ తేదీ వరకు వరికోతలను కోయవద్దని ఏడీఏ తెలిపారు. యంత్రాల ద్వారా నూర్పిళ్లు చేసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి వేసే పంట ఈక్రాప్ చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగంచుకోవాలని ఏడీఏ తెలిపారు. ఏఓ శ్రీధర్, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు

మచిలీపట్నంటౌన్: స్థానిక 31 డివిజన్ శారదనగర్‌లో సేవా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. భానుమూర్తి రోగులకు వైద్య సేవలు అందించారు. శారదానగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దాదాపు 120 మందికి పరీక్షలు చేయగా ఇందులో 30 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి శస్త్ర చికిత్సలను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తామని డాక్టర్ భానుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు శామ్యూల్, మట్టా జయప్రకాష్, బీడెల్లి మరియ కుమార్, చిట్టిబాబు, గణేష్, శారదానగర్ సేవా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సమావేశం

గూడూరు: డిసెంబరు 7న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను విజయవతం చేయడానికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం డీవైఈఓ బీఎస్సీ.శేఖర్‌సింగ్ కోరారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ సన్నాహకాలలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. డీవైఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయమే లక్ష్యంగా ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తుందన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఎంఈఓ– 2 పి.సుబ్రహ్మణ్యం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అవనిగడ్డ: వాతావరణ పరిస్థితి నేపథ్యంలో నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరు మండలాల తహసీల్దార్లు ధాన్యం కొనుగోళ్లపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధానంగా వరి కోత యంత్రాలతో కోసి గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు ఈ ప్రక్రియను ప్రతినిత్యం పర్యవేక్షిస్తూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సూచించారు.

అంబేడ్కర్ ఆశయాలను అమలు చేసిన జగన్

- వైఎస్సార్ సీపీ నాయకులు
- ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవం
- అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు

పెడన: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం కనిపించడం లేదని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. మండలంలోని బల్లిపర్రు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాము మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భారత రాజ్యాంగం అమలు చేయడమే కాకుండా రిజర్వేషన్లు ప్రకారం నడుచుకోవడమే కాకుండా అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుచుకున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నగర నడిబొడ్డున జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనికి అంబేడ్కర్ స్మృతివనంగా నామకరణం చేసి, సుమారు రూ.400 కోట్లకు పైగా వెచ్చించారన్నారు. ఎన్డీయే కూటమి అంబేడ్కర్ విగ్రహాన్ని, స్మృతివనాన్ని నాశనం చేసేందుకు యత్నించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, కేవలం కక్షసాధింపు చర్యలకు దిగుతూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ పెడన పట్టణం, గూడూరు మండలం అధ్యక్షులు బండారు మల్లి, పర్ణంపెదబాబు, గూడూరు జడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, శిరివెళ్ల జయేష్, భళ్ల గంగయ్య, మలిశెట్టి రాజబాబు, జల్లా భూపతి, బాబురావు, దావు బైరవలింగం, గరికపాటి వెంకటరామానాయుడు, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పెడన మండలం బల్లిపర్రులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాము తదితరులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు



సీతాయిలంకలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మచిలీపట్నంటౌన్: కులమతాలకు అతీతంగా భిన్నత్వంలో ఏకత్వంతో ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన జరిగినప్పుడే భారత రాజ్యాంగానికి సరైన అర్థం చేకూరుతుందని దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) అన్నారు. దళిత జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ వజ్రోత్సవాన్ని మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. దళిత జేసీ నాయకులు, పెద్దలు, అభిమానులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

దళిత జేఏసీ జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, కోశాధికారి కొడమంచిలి చంద్రశేఖర్, మండల శాఖ అధ్యక్షుడు ఉచ్చుల గణేష్, యూత్ అధ్యక్షుడు ఏ చైతన్య, దార్ల చెన్నకేశవరావు, కార్పొరేటర్లు ఎంద్రపాటి నాగేశ్వరావు, మాచవరపు రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు, ఎస్టీయూ నాయకులు కొమ్ము ప్రసాద్, దళిత సంఘ సీనియర్ నాయకులు ఎగ్గని గాంధీ, బూరగ రామారావు, చాట్రగడ్డ ప్రసాద్, గడిదేసి రాజు, జిల్లా ఎస్టీ సంఘ నాయకుడు మద్దెల పాండురంగారావు, అంబేడ్కర్, పూలే సంఘాల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చిరివెళ్ల సంధ్యారాణి, కొంద్రు చిన్నా, పత్తిపాటి ప్రేమ్‌కుమార్, దమ్ము కేశవరావు, లంబా అప్పారావు, ఉప్పులేటి సురేష్, గోరుముచ్చు ప్రభాకర్, మద్దాల నరసింహ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక పోర్టురోడ్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు బూరగ రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు దళిత సంఘ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కృత్తివెన్ను: దేశభక్తిని పెంపొందించడమే కాకుండా సత్ప్రవర్తనతో కూడిన జీవన విధానాన్ని మన భారత రాజ్యాంగం ప్రతి భారతీయునికి నేర్పుతుందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అండేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలను వేసి నివాళులర్పించారు. కూనసాని వాసు, అలెగ్జాండర్, హేమచలం, ఆలుబాబు, వీరబాబులు ఉన్నారు.

అపరమేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనేరుసెంటర్: భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరిగేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ అందరివాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవం సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కిట్టు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛా హక్కులతో జీవిస్తున్నారంటే అది అంబేడ్కర్ పుణ్యమేనని గుర్తు చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్, నగర వైఎస్సార్ సీపీ కన్వీనర్ షేక్ సిలార్‌దాదా, దళిత సంఘ నాయకులు జక్కుల ఆనంద్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గోని గాంధీ, బూరగ రామారావు ప్రసంగించారు. నాగేశ్వరరావు, రామ్‌ప్రసాద్, గడిదేశి రాజు, చీలి రవీంద్ర, ఉచ్చుల గణేష్, ఆటో పాండు, గాజుల భగవాన్, తప్పెట రాజు, దార్ల చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండల పరిధిలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, జిల్లా కార్యదర్శి గుర్రం బసవయ్య, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి, సీతాయిలంక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, గౌరుముచ్చు రమేష్ (మోణి), మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోడూరు: మండలంలో రాజ్యాంగ వజ్రోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ సుధాప్రవీణ్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి వెన్నా షైనీ, కార్యదర్శి బండే శేషగిరిరావు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ చాణిక్య సిబ్బందితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అనాథ పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోండి

కలెక్టర్ బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని పిల్లల సంరక్షణ సంస్థల్లో రక్షణ పొందుతున్న పిల్లలందర్నీ జువైనల్ జస్టిస్ చట్టం పరిధిలోకి తప్పనిసరిగా తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో అనాథ పిల్లల సమస్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలను, పిల్లల సంక్షేమ కమిటీ ద్వారా లీగల్లీ ఫ్రీ ఫర్ అడాప్షన్ సర్టిఫికెట్ మంజూరు చేసి కారా వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తద్వారా పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే వారి సౌకర్యార్థం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆధార్‌కార్డులు, సర్టిఫికెట్లు జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ ఎస్ సువర్ణ, జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ సత్యవతి, డీసీపీవో మోనిష పాల్గొన్నారు.

నగర సుందరీకరణపై దృష్టి పెట్టాలి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో తడి, పొడి చెత్తను సక్రమంగా సేకరించి నగర సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి తరలించేందుకు వీలుగా ట్రాక్టర్లను కేటాయించాలన్నారు. సేకరించిన పొడిచెత్తను నేరుగా జిందాల్ రీసైక్లింగ్ పరిశ్రమకు చేర్చాలన్నారు. జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనందకుమార్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం ఫణిదూర్జటి, మార్కెటింగ్ ఏడీ ఎల్ నిత్యానందం, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి చిన నరసింహులు, బీసీ సంక్షేమశాఖాధికారి జి.రమేష్, కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి చేయండి

పెడన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు

పెడన: మున్సిపల్ ఆదాయం పెంచేందుకు కృషి చేస్తే కౌన్సిల్ కూడా సహకారం అందిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి కౌన్సిల్ సమావేశానికి హాజరై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిల్ సమావేశం ప్రారంభ సమయంలో ఆమె కొద్దిగా అస్వస్థకు గురికావడంతో వెళ్లిపోయారు. అనంతరం వైస్ చైర్మన్ ఎండీ ఖాజా అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. 2024– 25 ఏడాదికి సంబంధించి సవరించిన బడ్జెట్‌ను, 2025– 26 ఏడాదికి బడ్జెట్ అంచనాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ ఆదాయం పెంపు, పారిశుధ్యం ఆధ్వానం గురించి తీవ్రస్థాయిలో చర్చలు జరిగాయి. సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం పెంపునకు అధికారులు కృషి చేయాలన్నారు. అనాధికార లేఅవుట్లను ఇప్పటికే గుర్తించారని, వాటి ద్వారా ఆదాయం పెరిగేలా తదుపరి చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీ ఖాజా మాట్లాడుతూ ఇప్పటికే పలు కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఇదే అంశం చర్చకు వస్తున్నా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కమిషనర్ గోపాలరావు స్పందిస్తూ తప్పకుండా తదు పరి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా పలు కట్టడాలు జరుగుతున్నాయని, ఆదాయం పెంచేందుకు అడుగులు వేయాల్సిందిగా సభ్యులు సూచించారు. 12వ వార్డు కౌన్సిలర్ శివపావని మాట్లాడుతూపారిశుధ్యం మెరుగుపరచాలని సభలో కోరారు. వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, టీపీవో సుగుణకుమారి కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, తదితరులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం(ఘంటసాల): జాతీయ స్థాయి అండర్ –14 సాఫ్ట్ బాల్ పోటీలకు శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థి పులగోరు వినయ తేజ ఎంపికైనట్లు హెచ్‌ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మంగళవారం తెలిపారు. చిత్తూరు జిల్లాలోని అరగొండలోని ఈశా విద్యానికేతన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్– 14 సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజయతేజ ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పోటీలలో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం చెప్పారు. విజయతేజను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ బడే వెంకటేశ్వరరావును హెచ్‌ఎం, సిబ్బంది, ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు, సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ చిన్నా అభినందించారు.

చల్లపల్లి(అవనిగడ్డ): హర్యాణాలో జరిగే జాతీయ స్థాయి స్క్వే పోటీలకు చల్లపల్లి శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.సురేష్ మంగళవారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి స్క్వే ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరు బంగారు పతకాలు, 16 సిల్వర్, 7 రజిత పతకాలు సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ సురేష్, ఈజీఎం మురళీ కృష్ణ, రీజనల్ ఇన్‌చార్జి రాజేష్ బాబు, కోచ్ సుబ్బు అభినందించారు. డిసెంబర్ 7,8,9 తేదీల్లో హర్యాణాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

పరుగులు పెట్టిస్తున్న వాతావరణం

ఘంటసాల: వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు వరికోతలు మొదలు పెట్టుకోవాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని ఘంటసాల, దేవరకోట, పుచ్చగడ్డ గ్రామాల్లో వరిపొలాల్లో మంగళవారం క్షేత్ర సందర్శన చేశారు. వరి కోత సమయంలో తీసుకోవాల్సిన సాంకేతిక పరమైన సూచనలను రైతులకు వివరించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కే రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దార్ విజయ ప్రసాద్, ఎంఏవో కె.మురళీ కృష్ణ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సార్వా కోతలు కోసి పనలపై ఉన్న పంటను, రోడ్ల పైన, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు మంగళవారం రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కొంత మంది రైతులు కోతల నిలిపివేశారు. దీంతోపాటు వారం రోజులుగా మిషన్లతో కోతలు పూర్తి చేసి కళ్లాల్లో, రోడ్లపైన ధాన్యం ఎండపెడుతున్న రైతులు బస్తాలకు ఎత్తుకుని భద్రపరుచుకుంటున్నారు. ఏఓ శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులకు కావలసిన సంచులు మిల్లర్లు సరఫరా చేస్తున్నారన్నారు.



కంచడంలో వరికుప్ప వేసే పనిలో కూలీలు

కృత్తివెన్ను: వాయుగుండం ప్రభావం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 7500 ఎకరాలలో రైతులు వరిని సాగుచేశారు. వాతావరణశాఖ హెచ్చరికలతో ఎక్కువ మంది రైతులు యంత్రాలతో కోతలు చేపట్టారు. నూర్పుళ్లు మొదలు పెట్టారు.

వెంకటాపురం(మోపిదేవి):వాతావరణంలో మార్పులను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి కోతలు చేపట్టాలని ఎంఏవో హెబ్సీబారాణీ సూచించారు. పెదప్రోలు, మోపిదేవి, వెంకటాపురం గ్రామాలల్లో మంగళవారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. పౌరసరఫరాల శాఖ జీపీఎస్ ద్వారా గుర్తించిన వాహనాల్లోనే ధాన్యం తరలించాలని సూచించారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో వరి కోతలు కోసినట్లు ఏఓ వివరించారు.

సంక్షిప్తంగా...

● ధాన్యం కొనుగోళ్లలో సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం

గూడూరు: ధాన్యం కొనుగోళ్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగళవారం గూడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను సిబ్బంది, రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సమస్యను కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సంక్రాంతిలోపు గ్రామాల్లో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పెడన నియోజకవర్గానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచులు గోపి నాగబాబు, కట్టా మునేశ్వరరావు, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఎంపీవో ఆంజనేయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా కార్తిక ఏకాదశి పూజలు

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరం శ్రీరామ పాదక్షేత్రంలోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం ప్రాంగణంలో సామూహిక సత్యదేవుని వ్రత మహోత్సవం కార్తిక బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రధాన పూజాక్రతువు నిర్వహించారు. నాగాయలంక, పరిసర గ్రామాల నుంచి వచ్చిన దంపతులు సామూహికంగా సత్యదేవుని వ్రతం ఆచరించారు. దాత సబ్బినేని వినయసాగర్– హరిత (విజయవాడ) దంపతుల ఆర్థిక సౌజన్యంతో పుష్కరఘాట్ ప్రాంగణంలో కార్తిక వన సంతర్పణ నిర్వహించారు. రామలింగేశ్వరునికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల తాతయ్య, తలశిల రఘుశేఖర్, గడ్డిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.


● వెంకటేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు


కోడూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఏకాదశి పర్వదిన నేపథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. మూలమూర్తులకు పంచామృతాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో స్వామి వార్లకు పంచ హారతులిచ్చారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● సహస్ర దీపాలంకరణ

నాగాయలంక: కార్తిక బహుళ ఏకాదశి పురస్కరించుకుని నాగాయలంకలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తులు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు అడపా విష్ణు నరసింహం సాయి నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జ్యోతులు వెలిగించారు. స్వామివారి ఎదుట లక్షవత్తుల కార్తీక జ్యోతి ఉంచారు. రాచంశెట్టి పాపారావు, వాడపల్లి నాగేశ్వరరావు, బచ్చు వెంకటేశ్వరరావు, రేమాల సాయి తదితర భక్తుల ఆర్థిక సౌజన్యంతో ఈ వేడుక నిర్వహించారు. ౦.

ఆకట్టుకున్న మహా రుద్రాభిషేకం





రుద్రాక్షల అభిషేకం తిలకిస్తున్న భక్తజనం (ఇన్‌సెట్లో) రుద్రాక్షల అలంకరణలో రామలింగేశ్వరుడు

నాగాయలంక: కార్తిక బహుళ ఏకాదశి వైభవంగా నిర్వహించారు. కృష్ణానదీతీరంలోని శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామ లింగేశ్వరస్వామి మండపంలో రుద్రుడికి 16 వేలకు పైగా రుద్రాక్షలతో మంగళవారం రాత్రి భక్తులు మహారుద్రాభిషేకం చేశారు. దాతలు, భక్తులు ఆర్థిక సౌజన్యంతో రుద్రాక్షలను సమకూర్చగా కమిటీ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకటనారాయణ పర్యవేక్షించారు.

● సమస్యలు పరిష్కరించాలని వినతి

అవనిగడ్డ: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చల్లపల్లి మండలం జీఎంఎస్‌కేలు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా పోలీసులను ఒకే డిపార్ట్‌మెంట్ కిందకు తీసుకొచ్చి స్పష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన బుద్ధ ప్రసాద్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

● ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళి

ఘంటసాల: చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య వర్ధంతిని స్థానిక ఏపీ పద్మశాలి సంఘ కోకన్వీనర్ అందే జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల పంచాయతీ ప్రాంగణంలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి జగదీష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రగడ కోటయ్య ఆశయాలను పాటిస్తూ, కుల వృత్తిని కాపాడుకుంటూ కుల వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకుని చేనేత వృత్తిని కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పద్మశాలి నాయకులు ఉడతా చిత్తరంజన్ సాయి, ఎ.లీలాప్రసాద్, ఎం.నాంచారయ్య, జె.శివరామకృష్ణ, జె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

● గంజాయి కేసులో నిందితుడి హల్‌చల్

కోనేరుసెంటర్: ఎస్కార్టు సిబ్బందిపై గంజాయికేసులో నిందితుడు దాడికి ప్రయత్నించాడు. ఈ సంఘటన మంగళవారం మచిలీపట్నంలో జరిగింది. జరిగిన సంఘటనపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంకు చెందిన బి. చరణ్ గంజాయి కేసులో నిందితుడిగా బందరు సబ్ జైలు నుంచి ఇటీవలే బెయిల్‌పై బయటికి వచ్చాడు. గంజాయి కేసులో అతనితో పాటు మరో ఇద్దరు నిందితులు సబ్‌జైలులో ఉన్నారు. మంగళవారం కేసు వాయిదా ఉండటంతో ఎస్కార్టు సిబ్బంది వారిని కోర్టుకు తీసుకెళ్లారు. అక్కడ చరణ్ వారిని కలిశాడు. స్నేహితులను కలిసిన కొద్ది సేపటికి చరణ్ ఎస్కార్టు సిబ్బందిని దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించాడు. కోర్టు ప్రాంగణంలో ఈ తతంగం జరగటంతో చిలకలపూడి పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● ఎల్‌ఐసీ ఉద్యోగుల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చాలు సంయుక్తంగా పలు డిమాండ్‌లతో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు మద్దతుగా మంగళవారం రాత్రి స్థానిక ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద ఐసీఈయూ సంఘ నాయకులు, ఉద్యోగులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఐసీఈయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి జీ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐసీఈయూ నాయకులు జె.సుధాకర్, డి.వాసు, ఎల్.రాజశేఖర్, యూ రామాంజనేయులు, వై.స్వామినాథ్, ఎ.శ్రీనివాసరావు, రత్నారావు పాల్గొన్నారు.

● చెరువు భూముల సర్వే

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కోనేరు 7.50 ఎకరాల సరిహద్దు పూర్తి స్థాయిలో నిర్ధారణ కాలేదని జిల్లా సర్వేయర్ లీలా ప్రసాద్ అన్నారు. చెరువు గట్టు హద్దున ఉన్న రైతు తన భూమికి సంబంధించి సరిహద్దు నిర్ణయించాలని జిల్లా సర్వేయర్‌ని కోరారు. జిల్లా సర్వేయర్ ఉభయులకు నోటీసులు ఇచ్చి స్థానిక మండల సర్వేయర్‌తో కలిసి ఆ రైతుకు ఉన్న డ్యాకుమెంట్స్ ప్రకారం సరిహద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. ఇదే సర్వే నంబరు 633 లోనే ఉన్న దేవస్థానం చెరువు 7.50 ఎకరాలకు మరోసారి సర్వే చేయాలని వివరించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● ఎన్‌సీసీ ట్రెక్కింగ్ సర్టిఫికెట్ ప్రదానం

గూడూరు: మహారాష్ట్ర శివాజీ ట్రెక్ ఎట్ కొల్హాపూర్ మూవ్ ప్లాన్‌లో భాగంగా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్ పూర్తి చేసుకున్న గూడూరు విద్యార్థి పోతన మణిదీప్‌కు ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం మంగళవారం ట్రెక్కింగ్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఆల్ ఇండియా స్థాయిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్ ఈనెల 8 నుంచి 17 వరకు జరిగింది. క్యాంప్‌కు గూడూరు హైస్కూలు నుంచి ప్రాతినిధ్యం వహించిన 9వ తరగతి విద్యార్థి పోతన మణిదీప్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో మణిదీప్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హెచ్‌ఎం డి.పుష్పలత, గూడూరు ఎన్‌సీసీ ఆఫీసర్ మత్తి అరుణ, తదితరులు పాల్గొన్నారు.